# ఇల్లు

**రా**మనగర్ రైల్వేగేటు సమీపంలో, నాలుగురోడ్ల కూడలి వద్ద, వేపచెట్టు నీడలో నిల్చుని, అటూ ఇటూ నాలుగు క్షణాలు చూసి, ప్రక్కనే కిళ్లీకొట్టు దగ్గరకు వెళ్లి, ఒక సిగరెట్ కొనుక్కుని, నింపాదిగా వెలిగించి, కిళ్లీకొట్టు యజమాని వేపు చూస్తూ "ఇక్కడకు దగ్గర్లో మేస్త్రీ వీరాస్వామి ఉన్నాడట! ఆయన ఇల్లు మీకు తెలుసా" అంటూ విచారించాడు వెంకటేశ్వర్లు!

"కొత్తపల్లి వీరాస్వామేనా?" అని ఎదురుప్రశ్న వేస్తే, "ఇంటి పేరు తెలీదు. మేస్త్రీ వీరాస్వామే అని చెప్పినారు నాకు" అన్నాడు వెంకటేశ్వర్లు.

"మీరు నేరుగా ఎదురు వీధిగుండా వెళ్తే పాండురంగ స్వామి టెంపుల్ వస్తుంది. దాని పక్క పడమర వీధిలో ఎవర్ని విచారించినా ఇల్లు చూపిస్తారు" అన్నాడతడు.

సిగరెట్ తాగటం అక్కడే పూర్తిచేసి, ఎదురు వీధిలోకి నడిచాడు వెంకటేశ్వర్లు!

చెప్పిన గుర్తుల ప్రకారం ఇల్లు కనుక్కోవటం ఏమీ కష్టమనిపించలేదతనికి! ఇంటి ముందు ఎర్రపూల చిగరచెట్టు వుంది – చెట్టు నీడలో బెలుం బండలతో కట్టిన రాతి అరుగు వుంది. ఆ అరుగుమీద ఒక మధ్య వయసు స్త్రీ కూచుని వేరుశనక్కాయలు వలుస్తూ వుంది. ఆమె దగ్గరకు వెళ్లి "మేస్త్రీ వీరాస్వామి ఇల్లు ఇదేనామ్మా" అనడిగాడు. ఆమె ఔనన్నట్లు తల ఆడించింది.

"ఇంట్లో ఉన్నాడేమమ్మా" అనడిగాడు. లేడన్నట్టు తలూపిందామె!

ఆ తర్వాత వెంటనే ఏం మాట్లాడాలో దిక్కుతెలీక, రెండు నిమిషాలాగి "ఎక్కడికి వెళ్లినాడో చెబుతావేమమ్మా" అని అడిగాడు.

ఆమె చేస్తున్న పని ఆపి, అతని ముఖంలోకి చూసి, "కోవూరునగర్‌లో ఇల్లు కట్టిస్తున్నాడయ్యా – అక్కడుంటాడు" అని చెప్పింది. ఆ ఇంటి గుర్తులు అడిగి తెలుసుకుని ఆ వేపు నడిచాడు వెంకటేశ్వర్లు.

మేస్త్రీ వీరాస్వామి చాలా బిజీగల మనిషనీ అతడు దొరకటం అంత సులభం కాదనీ తెలిసిన వాళ్లు చెప్పనే చెప్పినారు. ఇల్లు అంటూ కట్టిస్తే మేస్త్రీ వీరాస్వామితోనే

కట్టించాలన్న తన నిర్ణయం తిరుగులేనిదని నలుగురి ముందు బలంగా అన్నప్పుడు "ఆ వీరాస్వామి వెయ్యిళ్ల పూజారి, అసలు నీకు దొరకల్ల గదా" అన్నారు తెలిసిన వాళ్లు! "ఏమయ్యా, ఈ వూళ్లో ఇళ్లు కట్టుకున్న వాళ్లంతా ఆ వీరాస్వామితోనే కట్టించినారా? ఆయప్ప కట్టని ఇండ్లు ఇండ్లు కావా? అందులో మనుషులు కాపురాలు చెయ్యటం లేదా? నీదంతా బలే విచిత్రం" అని తన్ను ఎగతాళి చేసినప్పటికీ, తన నిర్ణయం మార్చుకోలేదు వెంకటేశ్వర్లు. వీరాస్వామి అంటే ఏమనుకున్నారు? పెద్ద పెద్ద ఇంజనీర్లు కూడా అతడి గృహనిర్మాణ నైపుణ్యం ముందు మోకరిల్లాల్సిందే. గొప్ప సంగీత దర్శకులు తమ చేతి సంజ్ఞలతోనే తన అనుచరులను ఎలా నడిపిస్తారో, ఎలా సంగీతసృష్టి చేయిస్తారో అలా వీరాస్వామి తన కింది బేల్దారులతో అరచేతి సంజ్ఞతో అద్భుతాలు చేయిస్తాడు. అతని కింద పనిచేయటమే ఒక అదనపు క్వాలిఫికేషన్‌గా భావిస్తారు బేల్దారులు కూడా. అతడు పని ఒప్పుకున్నాడా ఆపని ఇక ఆగదు. చెప్పిన సమయానికి చెప్పిన తీరులో పని పూర్తవాల్సిందే! కేవలం పనివల్ల మాత్రమే ప్రతిభుడా ఆ వీరాస్వామి? అంత మాత్రమే అయితే అతనికి ఈ మాత్రం కీర్తి లభించేది కాదు. పనిలో అతడి నిజాయితీ అన్నిటికన్నా అతనికి గొప్పకీర్తిని తెచ్చిపెట్టింది. ఏ పద్ధతుల్లో పనిని ఒప్పుకుంటాడో, ఖచ్చితంగా ఆ పద్ధతుల్ని అమలుపరుస్తాడు వీరాస్వామి. చెప్పిన దానికంటే ఒక పైసా అదనంగా పుచ్చుకోడు. చెప్పిన నాణ్యతకు ఒక్క వీసం కూడా తక్కువ కానివ్వడు. అతడి మాటంటే మాటే. పనంటే పనే. అందుకే వెంకటేశ్వర్లు, వీరాస్వామికే తన ఇంటిపని అప్పచెప్పాలని మరీ గట్టిగా తీర్మానించుకొని అతడి కోసం బయల్దేరాడు.

వెంకటేశ్వర్లు పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో పదిహేను సంవత్సరాలుగా ఓ మోస్తరు ఉద్యోగం చేస్తున్నాడు – ఉద్యోగంలో చేరినప్పటి నుండీ అతడి జీవితాశయం ఒక్కటే! ఒక సలక్షణమైన, సుందరమైన, తన అభిరుచులకు అనుగుణమైన ఒక చిన్న ఇల్లును కట్టుకోవాలని. సొంత ఇంటిపై అతనికింత మమకారం ఏర్పడటానికి బలమైన కారణం తరాలుగా తమకెవ్వరికీ సొంత ఇల్లు లేకపోవటం! తన తండ్రి చిన్నపాటి ఉద్యోగం చేస్తూ జీవితమంతా అద్దె ఇళ్లలోనే బతుకు ఈడ్చి అద్దె ఇంటిలోనే తనువు చాలించాడు. తన తరంలోనైనా ఒక సొంత ఇల్లు కట్టుకొని తన భావితరాలకు ఒక గృహవారసత్వాన్ని సంక్రమింపచేయాలని అతని బలమైన కోరిక, జీవితాశయంగా రూపుదిద్దుకొంది! అయితే తన కొచ్చే కొద్దిపాటి జీతంతో అనుకున్నది అనుకున్నట్టు

జరగటం సాధ్యంగాని పని అని అతనికి చాలా కొద్దికాలానికే గ్రహింపు కలిగింది. అయినా అతని అంతరాంతరాల్లో ఆ కోరిక బుసలు కొట్టడం మానలేదు! జీవితంలో డబ్బు కూడబెట్టి ఇల్లు కట్టుకోవటం అసాధ్యమని భావిస్తున్న సమయంలో ఒక మిత్రుడు ఒక మంచి సలహాను చెవిన వేశాడు. "డబ్బు కూడబెట్టింతర్వాత ఇల్లు కట్టుకోవాలనుకోవటం నీ అజ్ఞానం. ఇల్లు ఎప్పుడూ అప్పుచేసి కట్టుకోవాలి! నెమ్మదిగా ఆ అప్పును తీర్చుకోవాలి. ముందుగా ఒక నాలుగైదు సెంట్ల ప్లాటు సంపాదించుకో! ఇంట్లోవున్న కొద్దిపాటి బంగారాన్నో, మీ తాతలకాలం నాటి భూమి చెక్కనో అమ్మేసి ఒక ప్లాటును సమకూర్చుకో. ఇప్పుడు గృహనిర్మాణానికి అప్పులిచ్చే సంస్థలూ, బ్యాంకులూ బోలెడున్నాయి. నీకింకా ఇరవై సంవత్సరాల సర్వీసుంది గదా. నెలకింత తీర్చేసుకోవచ్చు! ఇప్పుడెటూ అద్దె ఇంటికి కొంత తగలేస్తున్నావుగా. దానికి తోడు కొంత కలిపితే ఇంటిలోన్ తీర్చేసుకోవచ్చు" అని వివరించి చెప్పేసరికి, వెంటనే కార్యరంగంలోకి దూకినాడు వెంకటేశ్వర్లు!

భార్య మెడలోని బంగారాన్ని, స్వంతవూళ్లోవున్న నాలుగెకరాల భూమి చెక్కనూ అమ్మేసి, లక్ష్మీనగర్‌లో ఐదు సెంట్ల మునిసిపల్ అప్రూవ్డ్ ప్లాటును కొనేశాడు వెంకటేశ్వర్లు! ఒక గృహనిర్మాణ సంస్థను అప్పుకోసం ఆశ్రయించాడు!

స్వంతయింటి పట్ల వెంకటేశ్వర్లుకు కొన్ని అందమైన కలలూ ఊహలూ ఉన్నాయి. అతడు తన జీవితకాలంలో వేలాది ఇళ్లు చూశాడు! అయితే వాటిలో అతనికి నచ్చిన ఇళ్లు ఏ ఐదారు శాతం మాత్రమే! కొందరైతే లక్షలకు లక్షలు గుమ్మరించి ఇళ్లు కట్టుకుంటారు! ఇంటికి కాంపౌండ్ ఉండదు! పెరడు ఉండదు! గుహల్లా కట్టుకుంటారు మరి కొందరు. సరిగా కిటికీలే ఉండవు! మనిషి పట్టేంత మాత్రం తలుపులు పెట్టుకుంటారు! రైలు పెట్టెల్లా వరుసగా గదులు ఫ్రేమ్ చేసుకుంటారు కొందరు! బజార్లో నిల్చుని చూస్తే వంటింట్లో ఆడవాళ్లు వండే వంటావార్పు కన్పించేలా వుంటాయి అలాంటి ఇళ్లు. పెద్ద ఇల్లు కట్టుకొని కూడా ఇరుకుగా బాత్‌రూమ్, లెట్రినూ పిసినారుల్లా ఏర్పాటు చేసుకుంటారు కొందరు! ఇంటి ముందూ, వెనుకా, పక్కలా బొత్తిగా జాగా విడవకుండా ఆశపోతులా, ఉన్న స్థలం నిండా ఇల్లు కట్టుకుంటారు కొందరు! ఇలా ఎన్నో రకాల ఇళ్లు చూసి చూసి, తాను కట్టుకొనే ఇల్లు చిన్నదైనా సరే, పొందికగా, చక్కగా గాలీ వెలుతురూ వచ్చేలా, ఇంటి చుట్టూ జాగా విడిచి, చక్కని కాంపౌండ్ నిర్మించుకొని, ఇంట్లో అన్ని గదుల్లో కిటికీలు అమర్చుకొని, విశాలమైన తలుపులు

ఏర్పాటు చేసుకుని అందంగా, మధురస నిష్యందంగా, చూపరుల హృదయ సంస్పందంగా నిర్మించుకోవాలని ఏళ్ల తరబడి కలలు కంటూ వచ్చాడు వెంకటేశ్వర్లు!

ఇప్పుడు తను వుంటున్న అద్దె ఇల్లు అంటే విపరీతమైన ఎలర్జీ వెంకటేశ్వర్లుకు! అద్దె తక్కువ అన్న ఉద్దేశంతోనూ, ఇంటి యజమాని వేరే వూళ్లో వుంటున్నాడు కాబట్టీ ఆ ఇంటితో సరిపెట్టుకున్నాడతను! ఆ ఇంటి మొత్తానికి ఒకే ఒక తలుపూ, రెండంటే రెండే కిటికీలూ వున్నాయి. వంటిల్లయితే ఒక్కరంటే ఒకరు మాత్రమే, అదీ నిలబడే వంట చేసుకోవాలి! బాత్‌రూములో కదలకుండా మెదలకుండా స్నానం చేయాలి! చేతులు బార్లాచాపితే రెండుగోడలూ తగులుతాయి! లావెట్రి అయితే వెనుకవైపు ముడ్డీ, ముందువైపు మోకాళ్లూ తగుల్తాయి! విచిత్రమేమంటే ఆ ఇంటికొచ్చిన వాళ్లు చాలా మంది ఆ ఇంటిని విపరీతంగా మెచ్చుకోవటం! వాస్తురీత్యా సర్వలక్షణ సమన్వితంగా వుందట ఆ ఇల్లు! ఎంత తల నెరసిన వాస్తు పండితుడైనా ఆ ఇంట్లో ఒక చిన్నపాటి దోషాన్నీ చూపించలేడట! ఇంతకు మునుపైతే ఆ ఇంట్లో కొన్ని వాస్తు దోషాలుండేవట! ఆ ఇంటి యజమాని ఒక వాస్తు నిపుణుని సలహామేరకు ఆ ఇంటి రూపురేఖలే మార్చివేశాడట! నాలుగు కిటికీల్లో రెండు కిటికీలు మూసి వేశాడట! పెరటివైపున వున్న తలుపును మూసివేసి అక్కడ గూళ్లు పెట్టించాడట! విశాలంగా వున్న వంటిల్లును రెండు అరలుగా చీల్చి, ఒక భాగాన్ని దేవుని గదిగా మార్చివేశాడట! ఇలా చేయాల్సిన మార్పులన్నీ చేసేసరికి వినాయకుడిని చేయబోతే కోతిలా తయారైనట్టు చివరకా ఇల్లు చిన్న సైజు గుహలా మారిపోయింది! ఆ ఇంట్లో అద్దెకు చేరి మూడేళ్లయింది వెంకటేశ్వర్లు. తక్కువ బాడుగ కాబట్టి, తన ఆఫీసుకూ, పిల్లల స్కూల్‌కూ దగ్గర కాబట్టి సర్దుకుపోతున్నాడింత కాలమూ! ఆ ఇంట్లో కాపురం వుండటం వల్లనే ఇల్లు అనేది ఎలా వుండకూడదో అతనికి అర్థమైపోయింది!

లక్ష్మీనగర్‌లో ప్లాట్ కొనగానే, ఆ ప్లాట్ మీద ఊహల్లోనే ఒక అందమైన ఇల్లును నిర్మించుకొన్నాడతడు! ఒక వెడల్పాటి దళసరి కాగితం తీసుకొని, తానే స్వయంగా దాని మీద ఇంటిప్లాన్‌ను ముచ్చటగా గీచి పెట్టుకున్నాడు. అతని ప్లాటు చదరపు ప్లాటు! పొడవు యాభై అడుగులు, వెడల్పు యాభై అడుగులు! అలాంటి ప్లాటు దొరకటమే తన అదృష్టమనుకున్నాడు వెంకటేశ్వర్లు! సరిగ్గా ప్లాటు మధ్యలో ఇల్లు కట్టుకోవాలని అతని ఉద్దేశం! అలాగైతే, ఇంటి ముందు భాగంలోనూ, వెనుక భాగంలోనూ, పక్కవైపులా సమానంగా జాగా వుంటుంది. ఆ స్థలంలో చెట్లూ,

మొక్కలూ, కూరగాయల పాదులూ వేసుకోవచ్చు గదా అని అతని ఆలోచన. మెట్లెక్కి ఇంట్లోకి అడుగుపెట్టగానే, వచ్చిన అతిథులు కూచోటానికి 10×10 అడుగులతో ఒక సిటింగ్ రూమ్‌కు ప్లాన్ చేసుకున్నాడు. సిటింగ్ రూమ్ పక్కన 15×10 అడుగులతో విశాలమైన ఒక లివింగ్‌రూమ్! ఇంటి మధ్యలో ఒక విశాలమైన హాలు! హాల్లోంచి ఎడమవైపున వంటిల్లు, కుడివైపున బాత్‌రూమూ, స్టోరుగదీ, వంటింట్లోంచి పెరట్లోకి తలుపు, పెరట్లో కుడిమూలన లావెట్రీ! వెనకవైపు నుంచీ ఇంటిపైకి మెట్లు! ప్రతి గదిలోనూ, హాల్లోనూ, వంటింట్లోనూ, ఇరువైపులా పెద్ద పెద్ద కిటికీలు! ఇదీ అతడు గీచిన ప్లాన్! రంగు రంగుల స్కెచ్ పెన్నులతో స్కేలు దబ్బ తీసుకొని అందంగా ప్లాన్‌ను గీచుకున్నాడతడు! తను కట్టుకోబోయే ఇంటికి ప్లాన్‌ను గీయటం అతనికి చాలా గర్వంగానూ, అపురూపంగానూ తోచింది! ఒక మంచి ఇంజనీరుతో ప్లాన్‌ను గీయించుకొమ్మని ఒకరిద్దరు మిత్రులు సలహాలు యిచ్చినా దాన్ని లెక్కపెట్టలేదు! తను కట్టుకోబోయే ఇల్లు తన అభిరుచులకు అనుగుణంగా ఉండాలి. ఎన్నో ఇళ్లు చూసిన తాను తన ఇంటికి ప్లాన్ గీచుకోలేడా! గీచిన ప్లాన్ కాగితాన్ని మడతలు పెట్టి భద్రంగా ఒక పెద్దకవరులో దాచి, దాన్ని చేతబట్టుకొని మేస్త్రీ వీరాస్వామిని అన్వేషిస్తూ బయలుదేరాడు వెంకటేశ్వర్లు!

పోస్టాఫీస్ రోడ్ దాటి, కోఆపరేటివ్ ట్రైనింగ్ కాలేజి మలుపు తిరిగి కోవూరునగర్‌లో అడుగుపెట్టి నాలుగు నిమిషాలు నడిచేసరికి, రోడ్డుకు ఎడమవైపున నూతన భవన నిర్మాణం కొట్టొచ్చినట్టు కన్పించింది – మూడంతస్తుల భవనం అది! రెండవ అంతస్తు కొసన కట్టెల మీద నిల్చుని ఇటుకలు పేరుస్తున్నారు కూలీలు. మూడు అంచెల్లో, ఇటుకలు రబ్బరు బంతుల్లా ఒకరి చేతుల్లోంచి మరొకరి చేతుల్లోకి లంఘిస్తూ పైవరుసలోని బేల్దారుల చేతుల్లోకి చేరుతున్నాయి – ఎన్నోసార్లు చూసిన దృశ్యమే అయినా, ఎప్పుడూ విస్మయంగానే వుంటుంది ఆ దృశ్యం అతనికి! ఆ భవంతి ప్రక్కనే వున్న వేపచెట్టు నీడలో నిల్చొని బేల్దారులకు ఆజ్ఞలు జారీచేస్తున్న, ఆరడుగుల నిలువెత్తు మనిషిని చూడగానే గుర్తుపట్టేశాడు వెంకటేశ్వర్లు, మేస్త్రీ వీరాస్వామిని! వీరాస్వామితో మాట పరిచయం లేదు గాని ఎన్నోసార్లు, ఎన్నోచోట్ల అతన్ని చూసిన గుర్తుంది వెంకటేశ్వర్లుకు! పొడవాటి చొక్కా, వదులుగా వుండే పైజామాలాంటి ప్యాంటూ, భుజం మీద ఎప్పుడూ జీరాడే ఎర్రటి తువ్వాలూ, వినాయకుడికి ఎలుక వాహనంలాగా, అతడి ప్రక్కనే మోపెడ్ వాహనమూ, నోట్లో ఎప్పుడూ పొగచారతో

బీడీ, గంభీరమైన మేఘగర్జన లాంటి కంఠస్వరమూ, ఒకసారి చూస్తే చాలు ఎవరికైనా గుర్తుండిపోతాడు వీరాస్వామి!

వెంకటేశ్వర్లు సరాసరి వేపచెట్టు నీడలోకి వచ్చేసి, వీరాస్వామి ప్రక్కన నిల్చుని, మాట పలకరింపు కోసం "వీరాస్వామి మీరే కదా" అంటూ పరిచయాలు ప్రారంభించాడు! వీరాస్వామి తన చూపులను వెంకటేశ్వర్లు వేపు తిప్పి, సహజమైన వినయస్వరంతో "అవునయ్యా" అన్నాడు.

"మీతో పనుండి వచ్చాను వీరాస్వామీ" అన్నాడు వెంకటేశ్వర్లు!

"ఇంటిపనేనా స్వామీ! ఇప్పట్లో నాకు అబ్బదే" అన్నాడు, తనతో ఎవరికైనా ఇంతకుమించిన పనేం వుంటుందని అతనికి అనుభవమే!

ఆ జవాబుకు వెంకటేశ్వర్లు కొంత ఇబ్బందిని అనుభవిస్తున్నట్టు ముఖం పెట్టి "నేనింకా ఏదీ చెప్పకనే అలా అంటే ఎలా వీరాస్వామీ, అలా నీడలో బండ మీద కూచుందాం రండి" అంటూ వెంకటేశ్వర్లు అతని చేయి పట్టుకొని చెట్టు నీడలో కూచుండబెట్టి తానూ కూచున్నాడు.

"రెండిళ్ల పనులు ఒప్పుకున్నాను స్వామీ! అందుకే ఇప్పుడే అబ్బదని చెప్పినాను" అన్నాడు వీరాస్వామి!

"నిన్నేమీ నేను క్షణాల మీద పని చేసిపెట్టమని అడగ లేదే! నీ ఒప్పందాలు పూర్తయిన తర్వాతనే నా పని మొదలు పెట్టు!" అన్నాడు వెంకటేశ్వర్లు. తన వివరాలూ, తన ప్లాటు సంగతీ, దాని కొలతలూ, ఎస్టిమేషనూ వివరించినాడతనికి! "నీమీద గురితోనూ నమ్మకంతోనూ, నీతోనే ఇల్లు కట్టించుకోవాలని నా కోరిక" అంటూ చెప్పుకొచ్చాడు!

"మీ ఇంటిపని ఒప్పుకోవటం నాకూ సంతోషమే. నా వృత్తే గదా అది! మాట ఒప్పుకున్న తర్వాత చెప్పిన టయ్యానికి చేసి పెట్టల్ల గదా! ఉగాది పండగ తర్వాతగాని తనకు అబ్బదు! అంటే ఆర్నెల్లు. మీకు ఇష్టమైతే మాట్లాడుకుందాం" అన్నాడు వీరాస్వామి!

"నీ మాట ప్రకారమే కానీ వీరాస్వామీ!" అంటూ తన చేతిలోని కవరు తెరచి ఒక దళసరి కాగితాన్ని మడతలు విప్పి వీరాస్వామి ముందు పరచాడు వెంకటేశ్వర్లు. చేతిలోని బాల్‌పెన్‌తో సూచిస్తూ ప్లాన్‌నంతా చాలా ఉత్సాహంగా వివరిస్తూంటే, జాగ్రత్తగా ప్లాన్‌ను చూస్తూ శ్రద్ధగా వింటూండిపోయాడు వీరాస్వామి!

అంతా విన్న తర్వాత, నాలుగైదు నిమిషాలు నిశ్శబ్దంగా వుండిపోయి, బీడి వెలిగించి నాలుగైదు దమ్ములు లాగి "ఈ ప్లానంతా ఎవరితో గీయించినారు స్వామి" అనడిగాడు వీరాస్వామి!

ఆ మాట కోసమే ఎదురు చూస్తున్నట్టు మరింత ఉత్సాహంతో "ఈ ప్లానంతా నేనే గీశాను వీరాస్వామీ! ఇదంతా నా స్వంత ఆలోచనే! ఎలా వుందంటారు?" ఆసక్తిగా అడిగాడు వెంకటేశ్వర్లు!

వీరాస్వామీ బీడి ఆర్పి, భుజం మీద తువ్వాలుతో మూతి తుడుచుకొని "అయ్యా! మీరేమీ అనుకోనంటే ఒక మాట చెబుతాను" అన్నాడు.

ఏం చెబుతాడో అని మనసు రెక్కలు విప్పి ఆతురతగా ఎదురు చూశాడు వెంకటేశ్వర్లు, "చెప్పండి వీరాస్వామీ!" అంటూ.

"మీ ఇల్లు కట్టటానికి నేను ఒప్పందం కుదుర్చుకోను" అన్నాడు ఎంతో శాంతంగా వీరాస్వామి. బాంబు పడినంత భయంకరంగా కాకపోయినా, ఏదో వినరాని మాట విన్నట్టు, జరగరానిది జరిగినట్టు, చలించిపోయాడు వెంకటేశ్వర్లు!

"ఏం వీరాస్వామీ! ఎందుకిట్లా అంటున్నారు?" అన్నాడు ఉత్సాహమంతా నీరుగారిపోయి, దిగులు స్వరంతో.

"ఈ ప్లాను ప్రకారం నేను ఇల్లు గడితే, రేపు ఇల్లు పూర్తయింతర్వాత నీ యింటిని ఎవరైనా జాగ్రత్తగా పరిశీలిస్తే, కట్టించే నీకు బుద్ధి లేకపోయినా, ఆ కట్టిన వాడికైనా బుద్ధుండక్కర్లేదా అని నన్ను చీవాట్లేస్తారు స్వామీ! అందువల్ల నేను ఈ ఇంటిని కట్టనుగాక కట్టను" అన్నాడు వీరాస్వామి తన మాటకిక తిరుగులేనట్లు!

"ఏమయింది వీరాస్వామి! నా ప్లాను నీకు నచ్చలేదా? ప్లాను బాగా లేదా?" అనడిగాడు వెంకటేశ్వర్లు బిక్కమొగం వేసుకొని!

"నీ ప్లాను నువ్వు కాపురం వుండటానికి నీ అభిరుచులకు అనుగుణంగా దివ్యంగానే వుండవచ్చు స్వామీ! అయితే సమస్త వాస్తుదోషాలూ ఈ ప్లానులో ఉన్నాయి" అన్నాడు వీరాస్వామి.

"వాస్తుదోషాలా?" అబ్బురపడిపోయాడు వెంకటేశ్వర్లు!

"అవునయ్యా స్వామీ! ముఖద్వారాన్ని దక్షిణం వేపు నైరుతి మూలగా ఎవరైనా ఏర్పాటు చేసుకుంటారా? ఈశాన్యం మూలన లావెట్రీ ఎవరైనా నిర్మించుకుంటారా?

పైపెచ్చు దాని మీదుగా ఇంటి పై భాగానికి మెట్లు ఏర్పాటు చేసుకుంటారా? పడమటి వేపు గదిలో వంటిల్లు అమర్చుకుంటారా? వంటింట్లోంచి పెరట్లోకి తలుపులు పెట్టుకుంటారా? గాలీ వెలుతురూ పేరుతో కిటికీలూ తలుపులూ పూర్ణాంకం వచ్చేలా ఇరవై సంఖ్య చేస్తారా? ఇంకా చెప్పాలంటే బోలెడున్నాయి. అవన్నీ చెప్పి నీ మనసును నేనెందుకు పాడు చెయ్యాల్ల! పాతకాలంలో అయితే ఇవన్నీ ఎవరూ పట్టించుకొనేవారు కాదు! ఇప్పుడు అద్దెకొచ్చే వాళ్లు కూడా వాస్తు చూసే కాలం వచ్చిపడింది! ఇలాంటి రోజుల్లో నీ ప్లాన్ ప్రకారం నేను ఇల్లు కడితే ఇక నాకు నూకలు పుట్టవు! నీ ఇల్లు కట్టింది నేను అని తెలిస్తే ఇంకేమైనా వుందా? ఇక నన్నెవ్వరూ ఇల్లు కట్టటానికి పిలవరు. నా బతుకు తెరువే నాశనమైపోతుంది ఈ దెబ్బతో! నీకూ నీ ఇంటి ప్లానుకూ ఓ నమస్కారం" అంటూ చేతులెత్తి దండం పెట్టినాడు వీరాస్వామి!

అప్రతిభుడై, నిశ్చేష్టుడై, నిర్విణ్ణుడై, నిరామయంగా, నిర్లిప్తంగా, అలానే చూస్తుండిపోయాడు వెంకటేశ్వర్లు.

❖ ❖ ❖

రెండేళ్ల తర్వాత...

రామనగర్ రైల్వేగేటు దిగువన నాలుగు రోడ్ల కూడలిలో కిళ్లీకొట్టు ముందు నిల్చుని సిగరెట్ తాగుతున్న వెంకటేశ్వర్లు తన్నెవరో పల్కరించినట్లయితే వెనక్కి తిరిగి చూశాడు. వెనకాల వీరాస్వామి! మేస్త్రీ వీరాస్వామి!

"ఏం స్వామీ! ఇల్లు కట్టించినావా!" అని ఆప్యాయంగా అడిగాడు వీరాస్వామి!

"కట్టి రెండేళ్లవుతూంది వీరాస్వామీ! నా ప్లాను ప్రకారం కట్టటానికి ఏ మేస్త్రీ కూడా ముందుకు రాలే! సరే అని నేనే ధైర్యం చేసి, బేల్దార్లను పట్టుకొని నా ప్లాన్ ప్రకారమే స్వయంగా ఇల్లును కట్టించేశాను! ఇప్పుడు ఆ ఇంట్లోనే సుఖంగా హాయిగా మా ఇంటిల్లపాదీ కాపురముండాము" అన్నాడు వెంకటేశ్వర్లు నింపాదిగా!

**❖ నవ్య-వారపత్రిక, 30-5-2007**